


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**78**

(22 అక్టోబరు 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

***కావాలి - కావాలి!***

ఎక్కడ విన్నా ఇదే మాట. ఉన్నవాడికీ కావాలి, లేనివాడికీ కావాలి. బుర్రలున్నవాళ్ళకూ ఏదో కావాలి. లేని వాళ్ళకీ కావాలి. సమాజానికి కావాలి. దేశానికీ కావాలి.

"చాలు. సంతృప్తిగా వున్నాను" అనుకునేవారు ఎక్కడా కనిపించడంలేదు. "నాకింకేం కావాలి - అన్నీ ఇచ్చాడు భగవంతుడు" అని సంతృప్తి ప్రకటించేవారెవరూ కనిపించడంలేదు.

ఒకవేళ భగవంతుడు ప్రత్యక్షమై ఎవరినన్నా "నీకేం కావాలో అడుగు - వరమిస్తా"నంటే - ఏం కోరతారో చెప్పలేం. అసలా కోరికలాయన తీర్చగలడో లేడో అంతకన్నా చెప్పలేం.

***వరదాత బిరుదు పోతుందేమో!***

ఆయన ఏ విధంగా తంటాలు పడ్డా కొందరి కోర్కెలు తీర్చడం అసంభవమేమోననిపిస్తుంది. ఎవరో ఒకర్ని అడిగి చూద్దాం - లేకపోతే మనకు 'వరదాత' అనే బిరుదు వుండదేమోననిపించి ఆ భగవంతుడు ఏ సిటీలోనో హఠాత్తుగా దిగి ఒక యింటికి వెళ్ళి "యజమానిని ఇలా పిలవండి ఒకసారి" అని కూర్చుంటాడనుకోండి.

యజమాని ఆ వచ్చిన పెద్దమనిషి తననేమి అడుగుతాడోననే భయంతో బయటికి రావడానికి హడలిపోవచ్చు. అప్పుడు భగవంతుడు "నేనయ్యా వచ్చింది వరదాతను. ఏదైనా వరమిచ్చి పోదామని వచ్చాను. నాకు విజిటింగ్ కార్డులు లేవు. అందుకని స్వయంగా పిలవవలసి వస్తోంది" అని సంజాయిషి పూర్వకంగా చెప్పుకుంటాడనుకోండి.

***వరాలు ఎన్నని కోరను ఇక్కడే వుండండి.***

అప్పుడు యజమానికి అంతులేని సంతోషం కలగవచ్చు. ఒక్కొక్కప్పుడు ఉబ్బితబిబ్బయి - "మీ అంతవారు వచ్చారా చాలా సంతోషం. పైగా వరాలు అడగమంటున్నారా! ఎన్నని చెప్పను మహానుభావా నేను బ్రతికి వున్నంతకాలం. మీరు ఎదురుగా అలా నిలబడితే అవసరం వచ్చినప్పుడు ఆయా వరాలు అడుగుతూ వుంటాను స్వామీ! కనుక దయవుంచి నాకా వరమియ్యండి - మీరు ఎప్పుడూ ఇక్కడ వుండి నాకు కావలసిన సహాయం చేస్తానని" అంటారు.

వెనుకటికి నటీమణి శ్రీమతి భానుమతిగారన్నారు - "భగవంతుడు ఈ రోజుల్లో ప్రత్యక్షం కావడానికి చాలా భయపడుతున్నాడు. అలవాటు ప్రకారం అలా సాక్షాత్కరించి వరమేమి కావాలి? అని అంటే నువ్వు భక్తులకు దాసుడవే గనుక మా యింట్లో నౌకరుగా వుండిపో" అంటారని ఆయనకు భయం. తీరా వరమిస్తానన్న తర్వాత యిచ్చితీరాలి గనుక ఆయన వైకుంఠం వదిలి వారియింట పడివుండాల్సివస్తుందనే సందేహంతో ఆయన కనిపించకుండా వుండటమే మంచిదని భావించి వుంటారు - అని.

నిజమే భగవంతునిచేత చేయించుకోవలసిన పనులు అనేకం వున్నాయి అందరికీ. అందులో ఈ నాగరికతా ప్రపంచంలో సమస్యలకే కరువా! ఎన్నో వున్నాయి. అసలు నిజమాలోచిస్తే బగవంతుడు ఆయనగారికి వున్న సర్వశక్తులూ ఉపయోగించే ఒక్క సంసారానికి కావలసిన వసతులు ఏర్పరచి, పేరు నిలబెట్టుకోగలడా! చాలా అవస్థపడతాడు అలా ఒప్పుకుంటే.

***కాలింగ్‌బెల్ నొక్కగానే కనిపించాలి.***

సరే వచ్చి ఒక గృహస్థును ప్రశ్నించాడనుకొందాం. ఆయనగారు తటపటాయిస్తాడు ఏం అడగాలో తెలియక. ఆలోచించి, ఆలోచించి చివరకు - "ఎన్నని నిన్ను అడగను? రోజురోజుకూ క్రొత్త అవసరాలు వస్తున్నాయి - కనుక నాకు సర్వశక్తులూ ప్రసాదించగలిగితే ప్రసాదించు. లేదా కాలింగ్‌బెల్ నొక్కగానే గభాలున పరుగెత్తుకు వస్తానని వాగ్దానమన్నా చెయ్యి" అంటాడు.

ఇంకోరకం గృహస్థు అయితే తనకు వున్న అలవాటు ప్రకారం "ఉండండి. లోపలికి వెళ్ళి మా ఆడవాళ్ళను అడిగి వస్తాను" అంటాడు.

విషయం లోపలికి వెళ్ళిన తర్వాత ఆ గృహస్థు పెత్తనం నశించి పోవడం తథ్యం. లోపలనుంచి ఎలాంటి కోర్కెలు వస్తాయో చెప్పలేం. అవి ఆమె పరమైనవిగా వుంటాయి గాని పురుషపుంగవుని పరంగా గాని, అతని హోదాకు సంబంధించిగాని వుండటం అసంభవం.

***వెళ్ళివాళ్ళావిడను పంపమను***

ఒకప్పుడు ఆ గృహిణి - భగవంతుని వరాలడగడం వల్ల ఈ రోజుల్లో ఎక్కువ ప్రయోజనం లేదని గ్రహించి భర్తను పిలిచి "ఒక్క చిన్న పనిచెయ్యమనండి. ఆయన్ని సరాసరి యింటికి వెళ్ళివాళ్ళావిడను పంపమనండి. చెప్పుకునేదేమిటో ఆవిడగారితోనే చెప్పుకొంటాం. మధ్య ఈయన పెత్తనమేమిటి?" అనడం కూడా తటస్థపడవచ్చు.

భగవంతుడు తన బిరుదు నిలబెట్టుకోవాలన్న తాపత్రయంతో బయలుదేరితే బయలుదేరవచ్చుగాని - అలాంటి సందర్భాలలో కొంచెం దివ్యదృష్టి ప్రసాదించకపోతే మాత్రం దెబ్బతింటాడు. తప్పదు.

నేనేగదా లోక రక్షకుణ్ణి, అఖండ ప్రతిభావంతుణ్ణి, అనుపమ తేజోనిరాజమానుణ్ణి అనుకొంటూ వెళ్ళి ఒక గృహస్థుని పిలిచి "ఏం వరం కావాలి?" అని అడుగుతాడనుకోండి.

ఆ గృహస్థు బయటికి వచ్చి - "నువ్వా?భగవంతుడివా! అసలు నీలాటివాడొకడున్నాడని నాకు నమ్మకంలేదే నిన్ను వరాలేం అడగమన్నావు? ఏదో ఈ ప్రాంతంలో వాడికే ఈ పేరు పెట్టుకుని వచ్చి మోసం చెయ్యాలని చూస్తున్నావల్లే వుంది. ఈ తమాషాలు మనదగ్గిరసాగవు. తక్షణం బయటికి దయచెయ్యి" అనడం కూడా సంభవమే.

***నేనున్నానయ్యా.. ఎడ్రసు తీసుకోవయ్యా!***

"అలా అంటావేమిటయ్యా! నేను వున్నానయ్యా. నా ఎడ్రసు కావలిస్తే ఇస్తానయ్యా. పర్మనెంటు ఎడ్రసు వైకుంఠమయ్యా. వేరే ఫోనులు లేవయ్యా. ఏ భక్తుడి గుండె 'డయల్' చేసినా ఫోనుకాల్ నాకందుతుందయ్యా. అసలు ప్రతివారూ వారి ఆత్మశక్తితో వైర్‌లెస్‌లు పంపవచ్చుకూడా.

పూర్వం నేను ఎక్కడపడితే అక్కడ వుండేవాణ్ణి. సృష్టిలో నిండివుండే వాణ్ణి. కనుక పిలవగానే పలికేవాణ్ణి. కాని ప్రస్తుతం అలా వుండటం క్షేమం కాదని చిన్ని చిన్ని కాంప్‌లు ఎత్తేసి వెళ్ళి హెడ్ క్వార్టర్సులోనే వుంటున్నా. అప్పుడప్పుడు పాలకడలిలో సమ్మర్ క్యాంప్‌లు వేసేవాణ్ణి. ఈ యుగంలో అదీ భద్రంగా లేదని మానేశాను. నేను భగవంతున్నేనయ్యా కాస్త నమ్మవయ్యా.

వేదాలు, పురాణాలు, కావ్యాలు, గ్రంథాలు భగవద్గీతలు ఇవన్నీ వ్రాయించుకున్న దెందుకు. మీబోటి వారికి అనుమానాలొస్తాయనే" అని అనేక విధాలుగా ఆయనగారు నచ్చచెప్పుకోవలసి వస్తుంది.

***ద్విపాత్రాభినయం తప్పదు పాపం.***

ఎంత చెప్పినా `ఫలానా ఆయన` అంటూ లేడని నమ్ముతున్నప్పుడు వాకిట్లోకి వచ్చిన పెద్ద మనిషిని ఆయనేనని నమ్మమంటే ఎలా సాధ్యమవుతుంది. ఎంత చెప్పినా వినకుండా విసిగిస్తాడనుకోండి. అప్పుడేం చెయ్యాలి ఆ గృహస్తు?

చివరకు కోపం వచ్చి "ఒకవేళ నువ్వంటూ వుంటే అలాటి నమ్మకం నీకువుంటే నాకు మాత్రం లేదు. ఇక నువ్వు లేకుండా పోవాలి. అదే నేను కోరే వరం" అంటాడనుకోండి.

అప్పుడేం చేస్తాడా వరదాత. "లేని వాళ్ళకు లేనట్లుగా" "ఉన్నవాళ్ళకు వున్నట్లు"గా ద్విపాత్రాభినయం సాగించాలి.

Post your comments